కార్యాలయం ఖాళీ..
సేవలు శూన్యం



సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయం

- తహసీల్దార్ సెలవుతో నిలిచిపోయిన సేవలు
- ఇంతవరకూ ఇన్‌చార్జ్‌ను నియమించని వైనం
- అవస్థలు పడుతున్న పోలీసు అభ్యర్థులు
- ఇబ్బందులలో ప్రజలు, రైతులు, విద్యార్థులు



ఖాళీగా దర్శనమిస్తున్న తహసీల్దార్ కుర్చీ

సిబెళగల్: స్థానిక తహసీల్దార్ సెలవుపై వెళ్లడంతో మండలంలో రెవెన్యూ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి వ్యక్తిగత కారణాలతో ఈనెల 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మెడికల్ లీవ్‌లో వెళ్లారు. అయితే అప్పటినుంచి ఎవరికీ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించకపోవడంతో తహసీల్దార్ సంతకాలు, భూ పరిపాలన పనులు మండలంలో పూర్తిగా స్తంభించాయి. అయితే జిల్లాస్థాయి అధికారులు మండల స్థాయి రెవెన్యూ అధికారికి సెలవులు మంజూరు చేసే సమయంలో కనీసం ఇన్‌చార్జ్‌లను నియమించకపోవటంపై మండల ప్రజలు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి మండలానికి తహసీల్దార్ లేదా, ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా అధికారులకు బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని అంటున్నారు.

ఆగిన డిజిటల్ సంతకాలు

తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి వ్యక్తిగత సెలవులో వెళ్లటంతో కుల, ఆదాయ, ఓబీసీ, ఇతర ధ్రువపత్రాల జారీ, ఆన్‌లైన్ సేవలు పూర్తిగా స్తంభించాయి. దీంతో ఇటు రైతులు, అటు ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిజిటల్ కీ సైతం ఎవరికి అందజేశారన్నది తెలియదని కార్యాలయ అధికారులు అంటున్నారు. విషయం తెలియని మండల రైతులు, ప్రజలు రోజూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

అవస్థలలో పోలీస్ ఎంపిక అభ్యర్థులు

మండలానికి చెందిన పలు గ్రామాల యువకులు పోలీస్ ఉద్యోగాలకై జరుగుతున్న ఎంపిక పోటీలకు అవసరమైన ధ్రువపత్రాలు పొందడంలో అధికారుల సంతకాల కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. కార్యాలయానికి వచ్చే అభ్యర్థులకు కనీసం క్రీమీలేయర్, ఓబీసీ, ఫ్యామిలీ మెంబర్ ధ్రువపత్రాలకు సంతకాలు ఎవరు చేస్తారు, ఎక్కడ చేస్తారు, ఎప్పుడు చేస్తారన్న ప్రశ్నలకు సమాధానాలు లేకపోవటంతో తీవ్ర ఆవేదనతో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పైగా అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన, సమర్పణ గడువు సమీపిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండలానికి రెవెన్యూ అధికారిని నియమించి, ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్డీఓ ఆఫీసుకు వెళ్లమంటున్నారు



నేను పోలీస్ కానిస్టేబుల్ సెలక్షన్స్‌కు దరఖాస్తు చేసుకున్నాను. ప్రస్తుతం పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక పోటీలు జరుగుతున్నాయి. వీటికోసం అవసరమైన ఇన్‌కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్ల కోసం గత డిసెంబర్ 31వ తేదీన ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాను. ఈ రోజు వరకు నా క్యాస్ట్ సర్టిఫికెట్‌లో డిజిటల్ సంతకం కాలేదు అంటున్నారు. అత్యవసరంగా కావాలంటే ఆర్డీఓ ఆఫీసుకు వెళ్లి తెచ్చుకోమంటున్నారు. ఏమి చెయ్యాలో అర్థం కావడం లేదు. – మనోహర్, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థి, పోలకల్

జిల్లా అధికారులు స్పందించాలి



రైతులకు భూ సంబంధ సమస్యలతో పాటు, విద్యార్థులు, యువకులు, పథకాల లబ్ధిదారులకు కావాల్సిన సర్టిఫికెట్లకు తహసీల్దార్ డిజిటల్ సంతకం అవసరం ఉంటుంది. అయితే సి.బెళగల్ మండలంలో తహసీల్దార్ సెలవులో వెళితే ఆ బాధ్యతలను జిల్లా అధికారులు ఎవరికీ ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉంది. ఒకవైపు పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కానిస్టేబుల్ అభ్యర్థులకు అవసరమైన సర్టిఫికెట్లను వెంటనే మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలి. – వీరేష్‌యాదవ్, ఎస్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

గొడవలకు దిగుతున్నారు



మండల తహసీల్దార్ ఈ నెల మొదటి నుంచి మెడికల్ లీవ్‌లో వెళ్లారు. తహసీల్దార్ సెలవులో ఉన్న విషయం ఉన్నతాధికారులకు తెలుసు. సంతకాల సమస్య మండలంలో చాలా ఉంది. వివిధ సర్టిఫికెట్ల కోసం డిజిటల్ సంతకాల నిమిత్తం విద్యార్థులు, కానిస్టేబుల్ అభ్యర్థులు కార్యాలయానికి వచ్చి నాతో గొడవపడి వెళ్తున్నారు. త్వరలో ఎవరికో ఒకరికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తారని అనుకుంటున్నా. – పురుషోత్తం, డిప్యూటీ తహసీల్దార్

క్లుప్తంగా

సివిల్స్‌పై అవగాహన

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సివిల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. నారాయణ ఐఏఎస్ అకాడమీ నుంచి శ్రీనాథ్, అనంతకృష్ణసాయి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారన్నారు. విద్యార్థులు ఇంజినీరింగ్ విభాగంలోనే గాకుండా సివిల్స్‌పై దృష్టి సారించవచ్చని సూచించారు. అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రొఫెసర్లు డేవిడ్ సుకీర్తికుమార్, సురేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



ఏఎస్ఐ నరసింహులుకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

పాణ్యం: తమ్మురాజుపల్లె గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్ జయలక్ష్మిపై దాడి చేసిన శివకుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలి ఆధ్వర్యంలో బుధవారం పాణ్యం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ నరసింహులుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలోకి వెళ్లి దాడి చేయడంతో అంగన్‌వాడీ వర్కర్ జయలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయన్నారు. నిందితుడు శివకుమార్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యూనియన్ సభ్యులు వెంకటమ్మ, మాబున్నిసా, భారతి, అనసూయ, ఉసేన్‌బీ, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

పరామర్శ



ఎద్దుల మహేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు

కోడుమూరు రూరల్: గుండె సంబంధిత చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్, దాత ఎద్దుల మహేశ్వరరెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీ మాజీ చైర్‌పర్సన్ విజయమనోహరి పరామర్శించారు. వారు బుధవారం సాయంత్రం కోడుమూరులోని మహేశ్వరరెడ్డి స్వగృహానికి చేరుకుని సుమారు గంటకు పైగా మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వెంట ఉన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ఉంటాం



టౌన్‌ప్లానర్ ప్రదీప్‌కుమార్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి

కల్లూరు: నగర పరిధిలోని గుత్తి రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వ్యాపారాలు చేసుకుంటున్న వారికి అండగా ఉంటామని కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. టెండర్ దక్కించుకున్న వారి ప్రోద్బలంతో బుధవారం మున్సిపాలిటీ అధికారులు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద చిరు వ్యాపారుల తోపుడు బండ్లు, వస్తువులను చిందరవందర చేశారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్లు అక్కడకు చేరుకుని వ్యాపారుల తోపుడు బండ్లను ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. గుత్తి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రెండు ఓ వైపు కారు పార్కింగ్, మరోవైపు మోటార్ సైకిళ్ల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేసి టెండర్ పిలిచారన్నారు. గతంలో టెండర్లు దక్కించుకున్న వారు అక్కడి చిరు వ్యాపారులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక చిరు వ్యాపారులను బెదరించి ఖాళీ చేయించాలని చూడగా కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. అయితే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందనే సాకుతో ప్రస్తుతం చిరు వ్యాపారులను ఖాళీ చేయించాలని చూడడం తగదన్నారు. కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ.. రోజు వారి ఆదాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కూరగాయలు, పండ్లు తదితర చిరు వ్యాపారులపై మున్సిపల్ అధికారులు, టెండర్‌దారులు దౌర్జన్యం సరికాదన్నారు. అధికారులతో మాట్లాడి వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

చిరు వ్యాపారులపై దౌర్జన్యం తగదు

స్థానిక గుత్తి రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై అధికార పార్టీ నాయకులు దౌర్జన్యం చేయడం తగదని సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా, నాయకులు సుధాకరప్ప, ఏసు అన్నారు. బుధవారం మధ్యాహ్నం చిరు వ్యాపారులపై దాడికి నిరసనగా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు మున్సిపాలిటీ ఉద్యోగుల సహకారంతో చిరు వ్యాపారులపై దౌర్జన్యం చేయడం హేయమైన చర్య అన్నారు. నాయకులు అక్బర్, లక్ష్మయ్య, స్థానిక చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



సి.బెళగల్‌లో మండల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించేలా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. బుధవారం జిల్లా అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు మండల అధికారులతో కలిసి ఆమె హాజరయ్యారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, హౌసింగ్, ఉపాధిహామీ, డీఆర్‌డీఏ అధికారులు, గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణ పథకాలపై ప్రభుత్వ లక్ష్యాలు, పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలతో పాటు, ఉపాధి హామీ పనుల కల్పన, జల్ జీవన్ మిషన్‌లో భాగంగా మంచినీటి పంపిణీ, డీఆర్‌డీఏ – వెలుగులో పొదుపు మహిళలకు రుణాలు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో నివేదికలను తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో గృహ నిర్మాణాలను లబ్ధిదారులతో పూర్తి చేయించాలని, ప్రజల ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల ఏర్పాటు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాలలో చేపడుతున్న అపార్ కార్డుల నమోదును వేగవంతం చేయాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని హెచ్‌ఎంలకు సూచించారు. హౌసింగ్ ఏఈ సుమంత్, ఉపాధిహామీ ఏపీఓ లక్ష్మన్న, వెలుగు ఏపీఎం రామేశ్వర్, ఆయా గ్రామ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న ఎస్ఓ బీకే వెంకటేశులు

కర్నూలు (రూరల్): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ బీకే వెంకటేశులు సూచించారు. మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు స్పెషల్ ఆఫీసర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతులు సమర్పించిన అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపుతామన్నారు. సదస్సులో రైతుల నుంచి మొత్తం 14 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. గ్రామ సర్పంచ్ జయన్న, వీఆర్ఓలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

మండల పరిధిలోని గ్రామాల్లో డిసెంబర్ 6 నుంచి ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు బుధవారం ముగిశాయి. ఈ సదస్సుల్లో మ్యూటేషన్, సర్వే, సవరణ, ఇంటి పట్టాలు, పొలం రస్తా సమస్యలు, భూ వివాదాలు, ల్యాండ్ కన్వర్షన్ తదితర సమస్యలపై 459 అర్జీలు అందాయని డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి



వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పీఎన్ అస్లాంను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు

కోడుమూరు రూరల్: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని గూడూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్ పీఎన్ అస్లాం అన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన పీఎన్ అస్లాంను బుధవారం నగర పంచాయతీ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ లక్ష్మన్న, కౌన్సిలర్లు మద్దిలేటి, కిషోర్, నంద కిశోర్, కేడీసీసీ మాజీ డైరెక్టర్ పత్తి రంగడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మునగాల రామాంజనేయులు, సుంకన్న, గిడ్డయ్య, లాలు బాషా, చికెన్ వలి, ప్రభాకర్, ఖాదర్, మద్దిలేటి, శివ, సుంకప్ప, శ్రీను, తదితరులు గజమాలతో సత్కరించారు.



రైతు నేస్తాల సందడి

పొలంలో గుంపులుగా చేరిన కొంగలు

పంట పొలాల్లో శ్వేత వర్ణం పక్షులు సందడి చేస్తున్నాయి. రైతులు పొలాలను దున్ని రబీ సీజన్ సాగుకు సిద్ధం చేసుకుంటున్న సమయంలో తెల్లటి కొంగలు గుంపులు గుంపులుగా చేరి అహారం కోసం అన్వేసిస్తున్నాయి. పొలంలోని పురుగులను తినేస్తూ వాటి ఆకలిని తీర్చుకుంటూ రైతులకు నేస్తాలుగా మారాయి. బుధవారం గడివేముల మండలంలోని కరిమద్దెల గ్రామం సమీపంలో కొంగలు గుంపులుగుంపులుగా చేరి చూపరులను కనువిందు చేశాయి. – గడివేముల

ముగిసిన క్రీడాపోటీలు

గడివేముల: జిందాల్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన మూడవ మండల స్థాయి క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. అండర్–17 కబడ్డీ బాలుర విభాగంలో ఏపీ మోడల్ స్కూల్ విజేత, గడివేముల జెడ్పీ హైస్కూల్ రన్నరప్‌గా నిలిచాయి. బాలికల విభాగంలో ఏపీ మోడల్ స్కూల్ విన్నర్, గని జెడ్పీ హైస్కూల్ రన్నరప్‌గా నిలిచాయి అండర్ –14 కబడ్డీ బాలుర విభాగంలో గడివేముల జెడ్పీ హైస్కూల్ విజేత, సెయింట్‌పాల్ స్కూల్ రన్నరప్, బాలికల విభాగంలో సెయింట్ పాల్ స్కూల్ విన్నర్, గడివేముల జెడ్పీ స్కూల్ రన్నరప్‌గా నిలిచాయి. ఆయా క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్, హెచ్ఎం విక్టర్ ఇమ్మాన్యుయేల్, వ్యాయామ ఉపాధ్యాయుడు భుజంగరావు, జిందాల్ ప్రతినిధులు విజయలక్ష్మి, భాస్కర్ అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

రోడ్డుకు అడ్డం



భారీ వాహనాలను రోడ్డుపై నిలిపి పంక్చర్లు వేసుకుంటున్న దృశ్యం

గడివేముల–నంద్యాల రహదారిలో పంక్చర్ దుకాణాల వద్ద భారీ వాహనాలకు పంక్చర్ వేసుకునేందుకు రోడ్డుపైనే నిలుపుతుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా గ్రంధివేముల గ్రామం వద్ద వాహనాలను రోడ్డుపైనే ఉంచడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో రోడ్డు పక్కనే పంక్చర్ దుకాణాలు ఉన్నాయి. సమీపంలోనే జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. గతంలో ఈ మార్గంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని భారీ వాహనాలను రోడ్డుపై నిలపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. – గడివేముల

వ్యవసాయ విద్యుత్ వేళల్లో స్వల్ప మార్పులు

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా గురువారం వ్యవసాయ బోర్లకు సరఫరా చేసే విద్యుత్ వేళల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సునీల్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ కార్బైడ్ ఫ్యాక్టరీ 220 కేవీ నుంచి ఓర్వకల్లు ఫీడర్‌కు సరఫరాలో కొంత మార్పులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకు ఓర్వకల్లు మండల పరిధిలో గల ఓర్వకల్లు, నన్నూరు, కాల్వబుగ్గ, ఉయ్యాలవాడ సబ్ స్టేషన్‌ల పరిధిలోని వ్యవసాయ బోర్లకు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, తిరిగి సాయంత్రం 3 గంటల నుంచి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. రైతులు గమనించాలని కోరారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఓర్వకల్లు: విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఎంఈఓ ఓంకార్ యాదవ్ సూచించారు. ఆయన బుధవారం మండలంలోని కన్నమడకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులచే సమీక్షించారు. వివిధ సబ్జెక్టులలో వెనకపడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల హాజరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతిఒక్కరూ పాఠశాలకు వచ్చే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. హెచ్‌ఎంలు మద్దమ్మ, ఎస్తేరురాణి ఉన్నారు.

శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



శనగ పంట సాగులో మెలకువలను వివరిస్తున్న శాస్త్రవేత రామకృష్ణారావు

కోడుమూరు రూరల్: శనగ పైరును ఆశించే లద్దె పురుగులు, కాయ తొలిచే పురుగుల నివారణకు రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ ఏ.రామకృష్ణారావు సూచించారు. బుధవారం గూడూరు మండలంలోని పెంచికలపాడు, గుడిపాడు, కె.నాగలాపురం, జులకల్, ఆర్.ఖానాపురం గ్రామాల్లో రైతులు సాగు చేసిన శనగ పంటలను ఆయన పరిశీలించి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం శనగ పంట కాయ దశలో ఉందని. ఈ దశలో లద్దె పురుగు, కాయ తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. వీటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు, వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి మందులను తగిన మోతాదులో పిచికారీ చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కల్లూరు: మండలంలోని ఎ.గోకులపాడు, సల్కాపురం, నెరవాడ, కె.మార్కాపురం, పెద్దపాడు గ్రామాల్లో శనగ పంటను ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాల ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు బుధవారం క్షేత్ర సందర్శన చేసి పరిశీలించారు. శనగలో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. వీఏఏలు మాధవి, శ్రీప్రియ, రైతులు ఉన్నారు.

వీరనారాయణుడి దర్శనం.. సర్వపాపహరణం



వీరనారాయణస్వామి మూలవిరాట్, ఆలయ గాలిగోపురం



గాలిగోపురం పైభాగంలో రాతిపై మత్స్యావతారంలో చెక్కిన శ్రీమహావిష్ణువు ఆకారం



ఆలయం బయట భారీ మర్రిచెట్టు

పాణ్యం: ధనుర్మాసంలో పాణ్యంలో వెలసిన శ్రీ వీరనారాయణ స్వామిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగుతాయి. ఈ మాసంలో రోజూ తెల్లవారుజాము నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక పూజలు, అలంకారాలను భక్తులు దర్శించుకుంటే చాలు పుణ్యఫలం కలుగుతుంది. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయంలో గత నెల 16వ తేదీ నుంచి ధనుర్మాసం సందర్భంగా ప్రతి రోజూ విశేష పూజలు జరుగుతున్నాయి. భక్తులు వందలాదిగా తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటుంటారు.

పూర్వ కథ:

పాణ్యంలో వెలసిన వీరనారాయణస్వామి మూలమూర్తి అష్ట బహూ ద్విపాదములను కలిగిఉంది. ప్రయోగ సుదర్శన చక్రం, ఖడ్గం, గద, శంఖం, విల్లు, ముసలము, కటిహస్తం, అభయహస్తంతో వెలిశారు. సంస్కృత భాగవతంలో కాలనేమి అనే రాక్షస సంహారార్థమై ఉద్భవించిన మూర్తి శ్రీ వీరనారాయణస్వామి వారు. శ్రీవారి ఆలయాన్ని క్రీ.శ 7వ శతాబ్దంలో పశ్చిమ చాళుక్యులు సందర్శించినట్లు చరిత్ర ఆధారాల ద్వారా తెలుస్తోంది. క్రీ.శ 1321వ సంవత్సరంలో కాకతీయ రాజైన ప్రతాప రుద్ర మహారాజు శ్రీవారిని దర్శించి ఆలయ జీర్ణోద్ధరణ గావించి అభివృద్ధి చేసినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. క్రీ.శ 16వ శతాబ్దంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారు దర్శించి, సేవించి స్వయాన వారు రచించిన కాలజ్ఞానంలో దశమ శ్వాసములో వీరనారాయణస్వామి స్వయాన మమ్ము ధ్యానము చేయమని చెప్పారని రాసుకున్నారు. వారికి నలుగురు సంతానం తర్వాత ఒక కుమార్తె. ఆమెకు వీర నారాయణమ్మ అని పేరు పెట్టారు. ప్రస్తుతం ఆ వీర నారాయణ సంతతి వారే నేడు బ్రహ్మంగారి మఠాధిపతులుగా ఉన్నారు. ఆలయానికి తూర్పు దిక్కున భృగుమహర్షి ప్రతిష్ఠించిన బృంగీశ్వరాలయం, దక్షిణాన రుద్రాంశ సంభూతుడైన ఆంజనేయస్వామి ఆలయం, పశ్చిమాన భైరవాలయం, ఉత్తరాన పాణికేశ్వర స్వామి ఆలయం, అగస్త్యునిచే ప్రతిష్ఠితమైన ఆగస్త్యేశ్వరాలయం ఉన్నాయి.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

ధనుర్మాసం పురస్కరించుకొని ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా ఆలయానికి తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. స్వామి వారికి విశిష్ట పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తాం. – ఈఓ సువర్ణ

ప్రత్యేక పూజలు

ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి, గోధూళి, స్వామి వారి కల్యాణం కనులపండువగా నిర్వహిస్తారు. అలాగే అంగరంగా వైభవంగా రథోత్సవం జరుగుతుంది. అంతేకాక ధనుర్మాసంలో ప్రత్యేక పూజలు, ముక్కోటి ఏకాదశి నాడు ఉత్తర ద్వారా దర్శనం అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి ధనుర్మాసంలో ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకొని పునీతులవుతారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక విద్యుత్‌దీపాలు, మామిడి తోరణాలు, అరటి బొదెలతో అలంకరించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.